క్లుప్తంగా

జూలో సందడి



జూలో నీటి ఏనుగులను చూస్తున్న సందర్శకులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో దసరా సందడి నెలకొంది. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో జూకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. రెండు రోజులుగా పిల్లలను తీసుకొని ఎక్కువ మంది తల్లిదండ్రులు జూని సందర్శిస్తున్నారు. ఎక్కువగా కోతులు, ఏనుగులు, పులులు, నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్లు, పక్షులు, పాముల జోన్‌ల వద్ద పిల్లలు ఎక్కువగా సందడి చేస్తున్నారు. ఇక్కడ వన్యప్రాణులను చూడడంతో పాటు మధ్యలో ఉన్న ఆట స్థలాల్లో సరదాగా ఆడుకుని రోజంతా గడుపుతున్నారు. జూ పార్కుకు రోజువారీ ఆదాయం కూడా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు.

చికిత్స పొందుతూ రిమాండ్ ఖైదీ మృతి

ఆరిలోవ : కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఓ రిమాండ్ ఖైదీ మృతి చెందాడు. విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. గంజాయి కేసులో నిందితుడిగా కోటకు చెందిన కె.నాగరాజు(32) ఈ ఏడాది మార్చిలో విశాఖ కేంద్రకారాగారానికి వచ్చాడు. అప్పటి నుంచి ఇక్కడ రిమాండ్‌లో ఉంటున్నాడు. జైల్‌కు వచ్చినప్పటికే మద్యానికి బానిసయ్యాడు. దీనివల్ల ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నాడు. మూడు నెలలుగా జైలులో ఆస్పత్రి వైద్యులతో పాటు కేజీహెచ్‌లో డాక్టర్లు చికిత్స అందిస్తున్నారు. నాగరాజు ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణించడంతో ఈనెల 7న కేజీహెచ్ జైలు వార్డులో చేర్పించారు. అప్పటి నుంచి అక్కడ చికిత్స పొందుతున్న నాగరాజు శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ సమాచారాన్ని ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా తెలియజేసినట్టు సూపరింటెండెంట్ తెలిపారు.

270 మంది ఖైదీలకు నేత్ర పరీక్షలు



కేంద్ర కారాగారంలో ఖైదీలకు కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ ఫౌండేషన్ వైద్యుడు

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో శనివారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని కేంద్ర కారాగారం సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ ప్రారంభించారు. 270 మంది ఖైదీలకు కంటి పరీక్షలు చేశారు. వారిలో అవసరమైన 142 మంది ఖైదీలకు కళ్లజోళ్లు అవసరమని వైద్యులు నిర్ధారించారు. వీరికి ఒకటి, రెండు రోజుల్లో ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పర్యవేక్షణాధికారి ఎం.వెంకటేశ్వర్లు, ఉప సూపరింటెండెంట్ రామచంద్రరావు, కంటి ఆస్పత్రి వైద్యులు సర్వణ్, రత్నంరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



మండపం వద్ద ఏర్పాటు చేసిన దీపారాధన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు దుర్గానగర్‌లో స్థానిక యూత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి సన్నిధిలో దీపారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అమ్మవారికి దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

నాటు కోళ్లకు గిరాకీ

- దసరా పండగకు పెరిగిన ధరలు
- నందడిగా పాత డెయిరీ ఫారం సంత



డెయిరీ ఫారం వద్ద విక్రయిస్తున్న నాటుకోళ్లు

ఆరిలోవ: దసరా పండగను పురస్కరించుకుని నాటు కోడికి గిరాకీ పెరిగింది. మటన్ ధరతో నాటు కోడి ధర పోటీ పడుతోంది. సాధారణ రోజుల కంటే ఇప్పుడు మరో వంద రూపాయలు పెంచి విక్రయిస్తున్నారు. అయినా వినియోగదారులు దసరా మొక్కుల కోసం నాటుకోడి కొనుగోలు చేస్తున్నారు. జాతీయ రహదారిని ఆనుకుని పాత డెయిరీ ఫారం వద్ద నిత్యం నాటుకోళ్ల సంత జరుగుతుంటుంది. ప్రతి ఏటా దసరాకు వారం రోజుల ముందు నుంచి ఇక్కడ సంత మరింత సందడిగా మారుతోంది. కొందరు వ్యాపారులు దశాబ్దాలుగా నాటు కోళ్ల విక్రయిస్తున్నారు. నగరం నలుమూలల నుంచి వచ్చిన వారు ఇక్కడ నాటు కోళ్ల కొనుక్కొని వెళ్తుంటారు. ప్రస్తుతం ఇక్కడ నాటు కోడి కిలో రూ. 800కు విక్రయిస్తున్నారు. నాలుగు రోజుల కిందట వరకు ఈ ధర రూ.700 ఉండేది. సాధారణంగా దసరాకు వాహనాలు, యంత్రాలతో పాటు అమ్మవారికి ఎక్కువ మంది నాటు కోళ్ల మొక్కు చెల్లించుకుంటారు. దీంతో సాధారణ రోజుల కంటే ఇక్కడ దసరాను పురస్కరించుకుని కోళ్ల విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. ఇక్కడ రెండు నుంచి మూడు కిలోల వరకు బరువు తూగే కోళ్లు ఉన్నాయి. దీని ప్రకారం ఒక్కో నాటు కోడి ధర రూ.1,600 నుంచి రూ.2,400 మధ్యలో పలుకుతుంది. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని పెందుర్తి, కొత్తవలస, తిమిరాం, ముసురాం, వడ్డాది, మానాపురం, అచ్యుతాపురం, రణస్థలం, బుడుమూరు, కందివలస, సవరవిల్లి తదితర ప్రాంతాలలో జరిగే సంతల్లో వ్యాపారులు కోళ్ల కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొస్తున్నారు. ఆది, మంగళవారాలతో పాటు దసరా, అమ్మవారి పండగల సమయాల్లో పాత డెయిరీ ఫారం వద్ద ఎక్కువగా సందడి ఉంటోంది.

35 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్నా..



డెయిరీ ఫారం వద్ద సుమారు 35 సంవత్సరాల నుంచి నాటు కోళ్ల వ్యాపారం చేస్తున్నాను. కోడి రూ.20, రూ.30 ధర ఉన్నప్పటి నుంచి గ్రామాల్లో కొనుగోలు చేసి ఇక్కడ విక్రయిస్తున్నా. ఇప్పుడు నాటు కోళ్లు గ్రామాల్లో కూడా ఎక్కువగా దొరకడం లేదు. కోళ్ల కోసం దూర ప్రాంతాల్లో జరుగుతున్న సంతలకు వెళ్లాల్సి వస్తోంది. దసరాకు వారం ముందు నుంచి నాటుకోళ్లకు గిరాకీ ఉంటుంది.

– ఎస్.లక్ష్మణరావు, నాటుకోళ్ల వ్యాపారి

సంతల నుంచి తీసుకొస్తాం..



విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల పరిధిలోని రణస్థలం, మానాపురం, ఇటు కొత్తవలస, పెందుర్తి, వడ్డాది తదితర దూర ప్రాంతాలకు వెళ్లి అక్కడ సంతలెకల రైతుల నుంచి నాటు కోళ్ల కొనుగోలు చేస్తాం. వాటిని తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తుంటాం. దసరా రోజుల్లో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. ప్రస్తుతం కిలో రూ. 800కు విక్రయిస్తున్నాం.

– ఎస్.పాపారావు, నాటుకోళ్ల వ్యాపారి

త్వరితగతిన శివాజీ పార్కు అభివృద్ధి పనులు

- జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశం
- ఆధునికీకరణ పనులపై ఆరా



ఆధునికీకరించిన వాటర్ ఫౌంటైన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

ఎంవీపీ కాలనీ: శివాజీ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశించారు. శనివారం ఉదయం పార్కును సందర్శించిన ఆయన అభివృద్ధి పనులపై ఆరా తీశారు. దశాబ్దాల చరిత్ర కలిగిన శివాజీ పార్కును జీవీఎంసీ ఆధునికీకరిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కొద్ది రోజులుగా పార్కు పనులు వేగంగా జరుగుతున్నాయి. రూ.2 కోట్ల వ్యయంతో ఈ పనులు జరుగుతుండగా.. పార్కు ముఖద్వారం మార్పుతో పాటు సందర్శకుల సౌకర్యార్థం అనేక వసతులు సమకూర్చుతున్నారు. కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న వాటర్ ఫౌంటేన్లను రూ.50 లక్షల వ్యయంతో ఆధునికీకరిస్తున్నారు. శివాజీ మహారాజ్ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పనులను పర్యవేక్షించిన కమిషనర్.. అధికారులకు పలు సూచనలు చేశారు. పనులపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జోన్–3 ఈఈ శ్రీనివాసరావు, ఏఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో సంపత్‌కు 7వ ర్యాంకు



సంపత్‌ను సత్కరిస్తున్న డీఈవో చంద్రకళ

సీతమ్మధార: గతేడాది నిర్వహించిన ఒలింపియాడ్ నేషనల్ లెవల్ టెస్ట్‌లో గురుద్వారాకు చెందిన విద్యార్థి సంపత్ ఉత్తమ ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు, ఉమ్మడి రాష్ట్రాల్లో 7వ ర్యాంకు సాధించాడు. పీ అండ్ టీ కాలనీలోని ఎస్ఎంసీహెచ్ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. సెమ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలోని గురజాడ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థికి ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా శనివారం సంపత్‌ను జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) చంద్రకళ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ కన్వీనర్ గోపినాథ్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రామారావు, స్కూల్ స్టాఫ్ హేన, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

సీతమ్మధార : దొండపర్తిలో వెల సిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల 22 నుంచి 28 వరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. 22 సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారన్నారు. బ్రహ్మశ్రీ కలగా మురళీకృష్ణచే దేవీమహత్యంపై ప్రవచనం, 23 సాయంత్రం 6 గంటలకు రేడియో, టీవీ ఆర్టిస్ట్ యతిరాజు భాగవతార్ ఆధ్వర్యంలో హరికథా గానం, 24న సుధా సీతాపతిరావుచే హరే రామ సంకీర్తన, 25న సిరి డ్యాన్స్ అకాడమీ స్వర్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, 26న సాయిరాజు భక్తి రంజని బృందంచే భజనలు, 27న వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ప్రతినిధి కె.సునీత సారధ్యంలో కోలాటం, 28 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు లలితా మాతృ మండలి మహిళా సభ్యులచే సామూహిక పారాయణ జరుగుతాయన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు



లలిత పరమేశ్వరి అవతారంలో అమ్మవారు



ప్రేమసదన్‌లో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు



శ్రీలలితా సహస్రనామ పారాయణ యజ్ఞ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ట్రస్టీలు

ఏయూ క్యాంపస్: శరన్నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా కొనసాగుతున్నాయి. దుర్గమ్మ సన్నిధిలో భక్తిశ్రద్ధలతో పూజలు చేస్తున్నారు. పోలమాంబ ఆలయంలో శనివారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనమిచ్చారు. స్థానిక 20వ వార్డు చినవాల్తేరు, ఈస్ట్ పాయింట్ కాలనీల్లో ఆటో స్టాండ్‌ల వద్ద దుర్గాదేవి విగ్రహాలకు పూజలు చేశారు. లలితా పీఠంలో శ్రీలలితా త్రిపుర సుందరి అమ్మవారు శ్రీమహాలక్ష్మి దేవిగా దర్శనమిచ్చారు. శ్రీవరసిద్ధి వినాయక లలితా సుందరేశ్వర శక్తి పీఠం ఆధ్వర్యంలో శ్రీలలితా సహస్రనామ పారాయణ యజ్ఞ పుస్తకాన్ని ఆవిష్కరించారు. దేవీ శరన్నవరాత్రుల పూజా వ్రతకల్పంతో కూడిన ఈ పుస్తకాన్ని ఆలయ ప్రధాన అర్చకుడు కాండూరి లక్ష్మణస్వామి రచించగా.. ఆలయ ట్రస్టీ డాక్టర్ చిట్టిపంతులు, ఇతర ట్రస్టీల సమక్షంలో ఆవిష్కరించారు. అనంతరం పుస్తకాన్ని భక్తులకు పంపిణీ చేశారు.

లలిత పరమేశ్వరిగా దుర్గాదేవి

ఎంవీపీ కాలనీ: శ్రీసత్యసాయి సేవా సమితి విశాఖ సిటీ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో శ్రీలలిత పరమేశ్వరి అలంకరణలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు డీవీవీ సీతారామరాజు, పీఆర్ఎస్ఎన్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు. ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని శ్రీచండికాదేవి ఆలయంలో శనివారం అమ్మవారు లలితా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

లలిత త్రిపుర సుందరిదేవిగా భూలోకమాత

మద్దిలపాలెం: స్థానిక రేసపువానిపాలెంలో సీఎంఆర్ సెంట్రల్‌కు ఆనుకుని ఉన్న భూలోకమాత అమ్మవారిని లలిత త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.



రేసపువానిపాలెంలో లలిత త్రిపురసుందరి దేవి అలంకరణలో భూలోకమాత అమ్మవారు



డిఫెన్స్ ఫ్లాట్స్ వద్ద ఆటోస్టాండ్ ఆధ్వర్యంలో..



చినవాల్తేరు ఆటోస్టాండ్ వద్ద..

విద్యా సమాచారమ్

విద్యార్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛ క్యాంపస్



విద్యార్థులతో కలిసి ప్రాంగణం శుభ్రం చేస్తున్న ఆచార్యులు

ఏయూ క్యాంపస్: విద్యార్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛ క్యాంపస్ సాకారం అవుతుందని ఐఏఎస్ఈ ఆచార్యులు, విద్యా విభాగాధిపతి డాక్టర్ టి.షారోన్‌రాజు అన్నారు. శనివారం ఉదయం ఏయూ ఐఏఎస్ఈలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగ పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు స్వయంగా శుభ్రం చేశారు. వర్సిటీని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడం కోసం విద్యార్థులను భాగస్వాములను చేస్తూ నిరంతరం ఈ కార్యక్రమం చేపడతామని షారోన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగరాజ కుమారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ నుంచి డాక్టర్ అరవింద్ కుమార్, విభాగ అధ్యాపకులు, అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ కేంద్రం ప్రారంభం



విద్యార్థినితో ప్రారంభింపజేస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన అధునాతన కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ కేంద్రాన్ని శనివారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభించారు. అనంతరం కేంద్రం పని తీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్రం ప్రత్యేకతలు, ప్రజలు, విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. తరువాత విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్రాంతి గదిని విద్యార్థినితో వీసీ ప్రారంభింపజేశారు. అలాగే విభాగంలో ప్రయోగశాలను తనిఖీ చేశారు. విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్.రాజు మాట్లాడుతూ వ్యక్తిలో మానసిక సమస్యను గుర్తించడం, డిప్రెషన్, ఒత్తిడి స్థాయిలు, ఏంగ్జయిటీ, ఎమోషన్స్ వంటివి కాగ్నిటివ్ డిజిటల్ థెరపీ సహాయంతో గుర్తించడం సాధ్యపడుతుందన్నారు. ఆత్మహత్యల నివారణకు ఇది ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఆల్కహాల్ ఎవర్షన్ థెరపీ(మద్యం మాన్పించే విధానం), న్యూరో ఫిజియాలజికల్ లాబ్‌కు పని చేస్తున్న విధానాలు వివరించారు. ఈ కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్యాటరీ కారులో పర్యవేక్షణ



భవనాల పరిశీలనకు బ్యాటరీ కారులో వెళుతున్న అధికారులు

ఏయూ క్యాంపస్: పర్యావరణ హిత ఆంధ్ర విశ్వవిద్యాలయం కోసం అధికారులు మరో అడుగు వేశారు. వర్సిటీలో భవనాల పరిశీలనకు శనివారం బ్యాటరీ వాహనంలో వెళ్లారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ వాహనాన్ని స్వయంగా నడపగా, వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్, డీన్ డాక్టర్ జి.వీర్రాజు వెనక కూర్చుని పర్యవేక్షించారు. వర్సిటీలో భవిష్యత్తులో బ్యాటరీ వాహనాల వినియోగం పెంచుతామని అధికారులు తెలిపారు.

పోష్ కమిటీ ఏర్పాటు అవసరం



మాట్లాడుతున్న దిశా సీఐ నిర్మల

సీతంపేట: అంతర్జాతీయ ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ యాక్షన్‌ఎయిడ్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి దిశా పోలీస్ స్టేషన్ సీఐ నిర్మల మాట్లాడుతూ కార్యాలయాలు, కళాశాలలు, వ్యాపార వాణిజ్య సంస్థలు ఇలా మహిళలు పనిచేసే ఏ ప్రదేశంలోనైనా పది నుంచి 15 మంది మహిళలు ఉంటే పోష్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ పురుషుల నుంచి గాని, మహిళల నుంచి గాని లైంగిక వేధింపులు ఎదుర్కొంటే పోష్ కమిటీ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటుందన్నారు. సంస్థ హ్యూమన్ రైట్స్ డిఫెండర్ దుడ్డి ఇందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పోష్ కమిటీ సభ్యులు కోరాడ స్వర్ణ, యాక్షన్‌ఎయిడ్ ఆఫీసర్ డాక్టర్ ఇర్ఫాన్, వెండర్స్ కమిటీ సభ్యులు ఎర్రబిల్లి ప్రభాకర్, ట్రాన్స్‌జెండర్ ప్రతినిధి అమిత్ తదితరులు లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు.

వాడవాడలా అన్నసంతర్పణలు



కేఆర్ఎం కాలనీలో అన్నదానం చేస్తున్న ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు



22వ వార్డులో భక్తులకు ప్రసాదం పంపిణీ చేస్తున్న పీతల గోవింద్

మద్దిలపాలెం: శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా శనివారం వాడవాడలా అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీ ఎల్ఐసీ బిల్డింగ్ వద్ద జరిగిన అన్నదానం కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావు హాజరై భక్తులకు వడ్డించారు. అన్నదాన కార్యక్రమానికి విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ రూ.15వేలు విలువ చేసే బియ్యం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ 20వ వార్డు ఇన్‌చార్జి మువ్వల సురేష్, మండల కన్వీనర్లు పాల్గొన్నారు. పీతలవానిపాలెంలో శ్రీకృష్ణా యువజన సంఘం ఆధ్వర్యంలో అమ్మవారి మండపం వద్ద 7 వేల మందికి అన్నదానం నిర్వహించారు.

టీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు రాజీవ్‌నగర్‌లో క్రేజీ బాయ్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్ ప్రారంభించారు. విశాఖ ఎంపీ ఎంవీవీ 15 బియ్యం బస్తాలు అందజేశారు.

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డులోని సెక్టార్–6 యంగ్ టైగర్ బాయ్స్ ఆధ్వర్యంలో ఏబీసీ గ్రౌండ్‌లో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పార్టీ 18వ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి తొలుత దుర్గాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. 17వ వార్డు పెదవాల్తేర్ దుర్గాదేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు.



8వ వార్డులో అన్నప్రసాదం వడ్డిస్తున్న పుక్కళ్ల ధనలక్ష్మి, తదితరులు

బాలిక అదృశ్యం

టీచ్ రోడ్డు: మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైనట్టు కేసు నమోదైంది. రామ్‌నగర్‌కు చెందిన 10వ తరగతి బాలిక ఈ నెల 19న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బాలిక తల్లిదండ్రులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో శనివారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ రామారావు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు.

982వ రోజుకు ‘ఉక్కు’ రిలే దీక్షలు



982వ రోజు దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశంలోనే పెద్ద పరిశ్రమగా అవతరించిన విశాఖ ఉక్కు కర్మాగారాన్ని కేంద్రప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు అమ్మాలనుకోవడం దారుణమని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 982వ రోజు, శనివారం ప్లాంట్‌లోని పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వబోమన్నారు. నిరంతరాయంగా పోరాటాన్ని కొనసాగించడం ద్వారా కేంద్రప్రభుత్వంపై ప్రతిఘటన మరింత పెరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన కార్మికులు తలచుకుంటే ఉక్కు పరిశ్రమలోని ఒక్క రేకును కూడా కదల్చలేదన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వదిలి కార్మికులకు అండగా నిలబడాలని, విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వరంగ సంస్థగానే కొనసాగిస్తున్నట్లు ప్రకటించాలని కోరారు.